
బొమ్మ బొమ్మకో పాఠం


దామోదర ఆచారి

యాదమరి: జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదర ఆచారి రూపొందించిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. 1991 మే 21న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని తీవ్రవాదులు పొట్టన పెట్టుకున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఏటా మే 21న జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నాం. ఉగ్రవాదం, తీవ్రవాదం వల్ల కలిగిన అనర్థాలను దామోదర ఆచ్చారి తన కుంచెతో చక్కగా వివరించారు.


ఉగ్రవాదం

హింస విశ్వరూపం.. దాని తాలూకు నరమేధం, బెల్టు బాంబుతో సృష్టికి మూలమైన స్త్రీ వినాశనానికి పూనుకున్న వైనం, పక్కనే పైశాచికత్వానికి పరాకాష్టగా శవాలగుట్ట వేదనా శిఖరాలను ఆయిల్ కలర్స్‌తో చిత్రీకరించారు.



హింస ప్రభావం

తీవ్రవాదం పడగవిప్పితే బలయ్యేది సామాన్యులే. ఎన్నో కుటుంబాలు సర్వనాశనం కావడం ప్రజా జీవనం అశాంతికి గురి కావడం అందరికీ తెలిసిందే. వీటిని ఆక్రీలిక్ రంగులతో రూపొందించారు.



ప్రజా రక్షకుడు

మన మధ్యలోనే ఉంటూ మనల్ని కంటికి రెప్పలా కాపాడే వీరుడు పోలీస్. లైంగిక దాడులు, దోపిడీ, తీవ్రవాదంపై పోరాడుతూ శాంతి నెలకొల్పే త్యాగజీవి. అభయ హస్తంలా భరోసానిచ్చే ప్రజారక్షకుడిని ఆక్రీలిక్ రంగులతో అద్భుతంగా చిత్రీకరించారు.



డ్రోన్‌తో మందుల పిచికారీపై అవగాహన


డ్రోన్ సాయంతో మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ఐరాల: ఆధునిక యంత్ర పరికరాలను వినియోగించి మామిడి తోటల్లో సమయాన్ని, నగదును ఆదా చేసుకోవచ్చని జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు వై.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఇరువారంపల్లె ఆర్బీకే పరిధిలోని మామిడి రైతులకు, ఆర్బీకే సిబ్బందికి గరుడ కంపెనీ డ్రోన్ ద్వారా పురుగుల మందుల పిచికారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రోన్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పాటు కావాలన్నారు. ఇందులో గ్రూపు సభ్యులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఐదుగురు గ్రూపు రైతుల్లో ఎవరైనా బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్ డిగ్రీ పూర్తి చేసి ఉంటే 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. డ్రోన్ ఉపయోగించి పురుగు మందు ఏ విధంగా పిచికారీ చేయాలో ప్రత్యక్షంగా చూపించారు. డ్రోన్ సహాయంతో ఎకరా పొలంలో 10 లీటర్ల మందు కలిపిన నీటిని కేవలం 8 నిమిషాల్లోనే పిచికారీ చేయవచ్చన్నారు. తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, ఆర్బీకే సిబ్బంది మురళీకృష్ణ, రామ్‌చైతన్య, కావేరి, గణేష్, రెడ్డప్ప, సుజాత, గరుడ కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

పనితీరు మెరుగ్గా ఉండాలి

- ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి


మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి

పూతలపట్టు: సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగ్గా ఉండాలని ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శనివారం మండలంలోని పి.కొత్తకోట సచివాలయాన్ని ఆమె తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. 0–5 సంవత్సరాల మధ్యగల పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని వలంటీర్లకు సూచించారు. పంచాయతీలోని నిరుద్యోగుల వివరాలను సేకరించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఉద్యోగాలను భర్తీ చేయొచ్చని తెలిపారు. సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. పంచాయతీ ప్రజలకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎంపీడీఓ గౌరి, పంచాయతీ కార్యదర్శి జరీనా పాల్గొన్నారు

ఎయిడ్స్‌పై అవగాహన

బంగారుపాళెం: మండల కేంద్రంలోని దళితవాడలో శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ఐసీటీసీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హెచ్ఐవీ అంటే ఏంటి, ఎయిడ్స్ వ్యాధి ఎలా సంక్రమిస్తుంది.. తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఐసీటీసీ కౌన్సిలర్ బాబు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో హెచ్ఐవీ, ఎయిడ్స్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు


వైద్య సేవల గురించి వివరిస్తున్న డాక్టర్ శిరీష

బంగారుపాళెం: మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రధాన వైద్యాధికారి శిరీష తెలిపారు. ఆస్పత్రిలో ప్రతి మంగళ, గురువారం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే విధంగా బుధవారం, శుక్రవారం గర్భిణులకు స్కానింగ్ తీయనున్నట్లు తెలిపారు. గురువారం, శుక్రవారం చిన్నపిల్లలకు వైద్యనిపుణులతో పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు గాంధీవిగ్రహం ఎదుట నిరసన

చిత్తూరు కార్పొరేషన్: ప్రభుత్వం పేదలకు ఇస్తున్న ఇళ్ల స్థలాలను సమాధి స్థలంతో పోల్చిన చంద్రబాబు వ్యాఖ్యాలకు నిరసనగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేయనున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

జగనన్న విద్యా కానుక పరిశీలన

పూతలపట్టు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకలను ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి శనివారం పరిశీలించారు. యూనిఫామ్, షూస్, బెల్టులు, పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ కృష్ణారెడ్డి తెలిపారు. వారి వెంట సీఎంఓ గుణశేఖర్ రెడ్డి డీవైఓ కష్ణప్ప ఉన్నారు

కనుల పండువగా పుష్పపల్లకి సేవ

చిత్తూరు రూరల్: నగరంలోని గిరింపేటలో వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పుష్పపల్లకి సేవ కనుల పండువగా జరిగింది. స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ స్వామి వారిని దర్శించుకున్నారు.

విద్యుత్ తీగలపై కొమ్మలు తొలగించకుంటే చర్యలు

–విద్యుత్ శాఖ ఏడీ కొండయ్య

యాదమరి: విద్యుత్ వైర్లపై కొమ్మలు తొలగించకుంటే చర్యలు తప్పవని విద్యుత్‌శాఖ ఏడీ కొండయ్య హెచ్చరించారు. శనివారం సాక్షిలో వెలువడిన వానొస్తే కరెంట్ కట్ అనే శీర్షికతో వచ్చిన కథనంపై ఆయన స్పందించారు. శనివారం యాదమరి మండలంలో పర్యటించారు. పలు గ్రామాల్లో 33 కేవీ, 11 కేవీ వైర్లపై చెట్లు కొమ్మలు ఉండడాన్ని గుర్తించారు. సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలపై వినియోగదారులు సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే మర్యాదపూర్వకంగా సమాధానం చెప్పాలని సూచించారు. అవసరమైన చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆయన వెంట ఏఈ గుర్రప్ప ఉన్నారు.

నెలాఖరులోగా సబ్‌స్టేషన్ పనులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలోని అన్నుపల్లె నూతన సబ్‌స్టేషన్ పనులు ఈనెలాఖరు లోగా ప్రారంభించనున్నట్లు ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. డివిజన్ పరిధిలో చిత్తూరులోని గంగనపల్లె, అన్నుపల్లె, గుడిపాల మండలంలోని బొమ్మసముద్రం, గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని బాలగంగనపల్లె ప్రాంతాల్లో నూతన సబ్‌స్టేషన్లు నిర్మించనున్నమన్నారు. ఒక్కొక్క సబ్‌స్టేషన్ రూ.1.75 కోట్ల వ్యయంతో నిర్మించనున్నట్లు వివరించారు.

ఉత్తమ వలంటీర్లకు సన్మానం


వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు అర్బన్: ప్రభుత్వానికి.. ప్రజలకు వలంటీర్లు వారధిగా పనిచేస్తూ ప్రభుత్వం ఆశయానికి అనుగుణంగా పనిచేస్తున్నారని, ఇందుకు ప్రతిఫలంగా ప్రభుత్వం సన్మాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శనివారం చిత్తూరు నగరం 1,2,3,4 డివిజన్‌లలోని సచివాలయాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేనివిధంగా వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. తద్వారా ఇంటికే సంక్షేమ ఫలాలు అందేలా చూస్తోందన్నారు. పారదర్శకంగా పాలన సాగేలా చూస్తోందని తెలిపారు. వలంటీర్లు కూడా సేవాభావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మరింత మంచి పేరు తీసుకోరావాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీకాంత్, నవీన్, సునీత, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, నాయకులు ఎల్‌బీఐ లోకేష్‌రెడ్డి, రామ్ గణేష్, శివ, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో పీడీ దేవా

ఐరాల: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల క్రీడామైదానంలో సాఫ్ట్‌బాల్ జూనియర్స్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారన్నారు. తమ పాఠశాలకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో రోహిత్, ఉదయ్, శివ, వంశీ, చైతన్య, బాలికల విభాగంలో రూప, వర్షిణి, చందన ఎంపికైనట్లు వివరించారు. వీరందరూ ఈ నెల 26వ తేదీ నుంచి అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. క్రీడాకారులను పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, పీడీలు దేవా, శివ అభినందించారు.

పౌష్టికాహార ప్యాకెట్లు పంపిణీ


క్షయ రోగులకు పౌష్టికాహార ప్యాకెట్లను అందజేస్తున్న వైద్యులు

బంగారుపాళెం: స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో క్షయవ్యాధిగ్రస్తులకు అరగొండ అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచితంగా పౌష్టికాహార ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ శిరీష మాట్లాడుతూ.. క్షయ ప్రమాదకరమైన వ్యాధి కాదని అన్నారు. ప్రారంభ దశను గుర్తించి క్రమం తప్పకుండా చికిత్స చేసుకుంటే పూర్తిగా నయం అవుతుందని చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయవ్యాధికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. అపోలో సహకారంతో క్షయవ్యాధిగ్రస్తులకు 6 నెలల పాటు పౌష్టిక ఆహార ప్యాకెట్లు అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధి హరిత తెలిపారు. టీబీ సూపర్‌వైజర్లు శివకుమార్, ప్రకాష్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్: ఐరాల మండలం వైఎస్ గేట్‌లో శనివారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఇందులో పూర్ణచంద్రారెడ్డి నుంచి 44 కర్ణాటక మద్యం ప్యాకెట్లు, వెంగనపల్లెకు చెందిన వెంకటేష్ నుంచి 96 మద్యం ప్యాకెట్లు సహా రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే తవణంపల్లె గ్రామానికి చెందిన శ్యాం ప్రసాద్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు మోహన్‌బాబు, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు

ఐరాల/గుడిపాల/పూతలపట్టు: ఫ్యామిలీ డాక్టర్ విధానం గ్రామీణ ప్రజలకు వరం అని, ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత అన్నారు. శనివారం ఐరాల మండలం కలికిరిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 70 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. జీవన శైలి విధానంలో చోటు చేసుకున్న మార్పులతో అత్యధికంగా రక్తపోటు సంక్రమిస్తోందని, ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. ఆకు కూరలు, తాజా కూరగాయలు ఆహారంలో ఉండేటట్లు చూసుకోవాలన్నారు. అలాగే గుడిపాల మండలం మంది క్రిష్టాపురంలో డాక్టర్ సందీప్ వైద్య పరీక్షలు చేశారు. దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు సలహాలు, సూచనలు అందించారు. పూతలపట్టు మండలం ఎం.బండపల్లిలో డాక్టర్ ప్రయాంక 52 మందికి వైద్య సేవలు అందించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిన్నారుల కోసం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు


ఆధార్ నమోదు పరిశీలనలో కమిషనర్

చిత్తూరు అర్బన్: ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు నగర కమిషనర్ జె అరుణ తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని సాంబయ్య కండిగ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాల్లో పేర్లు నమోదు, లబ్ధి కోసం ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డ్ నమోదు చేయించే కార్యక్రమం ప్రత్యేకంగా చేపడుతున్నట్లు వివరించారు. నగరపాలక పరిధిలో ఇంకా 969 మంది చిన్నారులు ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఐసీడీఎస్, వార్డు కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి చిన్నారులందరూ ఆధార్ నమోదు చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అంబేద్కర్ నగర్, కట్టమంచి, టెలిఫోన్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, చామంతి పురం, మంగసముద్రం, మోరిగానిపల్లి, మురకంబట్టు, పీహెచ్ వాడ, సాంబయ్యకండిగ, బాలాజీ నగర్ వార్డు సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆధార్ కార్డు నమోదు చేసుకోవడంతో పాటు, పేరు, చిరునామా వంటి మార్పులు సరి చేసుకోవచ్చని చెప్పారు. సాంబయ్య కండిగ వార్డు సచివాలయంలోని ఆధార్ కేంద్రంలో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆధార్ నమోదు కోసం వచ్చిన చిన్నారులను కాసేపు సరదాగా ఆడించారు. కార్పొరేటర్ హరిణి రెడ్డి, సీఎంఎం గోపి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

పూతలపట్టు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య బోధిస్తున్నట్లు.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఎంపీడీఓ గౌరీ అన్నారు. శనివారం మండలంలోని వడ్డేపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. బడి ఈడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించేలా కృషి చేయాలని వలంటీర్లకు సూచించారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

- పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల అధికారి పర్వీన్


మాట్లాడుతున్న ఎన్నికల అధికారి పర్వీన్, తహసీల్దార్ చిట్టిబాబు

యాదమరి: మండల పరిధిలో ఓటరు జాబితా పక్కాగా నిర్వహించాలని బీఎల్ఓలు, సూపర్‌వైజర్లను పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల అధికారి పర్వీన్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్నాయన్నారు. బీఎల్ఓలు, సూపర్‌వైజర్‌లు వారి పరిధిలో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలని, గ్రామాల్లో లేని వారిని పరిశీలించి తొలగించాలన్నారు. ఓటుహక్కు కల్పించినా, తొలగించినా వాటికి సంబంధించి పక్కాగా రికార్డులు ఉండాలన్నారు. ఓటు హక్కు కల్పించడంపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తహసల్దార్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ఖరీఫ్ ముందస్తు సాగుపై అవగాహన


మట్టి నమూనా సేకరణపై అవగాహన

గుడిపాల: ఖరీఫ్ ముందస్తు సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్న అన్నారు. శనివారం పిళ్లారికుప్పం గ్రామంలో ఖరీఫ్ ముందస్తు సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులు సాధించడం, మట్టినమూనా సేకరణ, భూసార పరీక్షలు, వాటికి అనుగుణంగా ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. వేరుశనగలో విత్తన శుద్ధి, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, వేసవి దుక్కులు, సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మాధవి, సర్పంచ్ చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు బాలమ్మ, అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు తులసిరాంరెడ్డి, హనుమనాయక్ పాల్గొన్నారు.